క్లుప్తంగా

చురుగ్గా డ్రెయినేజీ పూడికతీత పనులు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో డ్రెయినేజీ పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ పెనుమత్స రాధిక ముందస్తుగానే డ్రెయిన్ల పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. కనకదుర్గమ్మ కాలనీ నుంచి దళిత వాడ వరకు బుధవారం మెయిన్ డ్రెయిన్‌ను పొక్లెయినర్‌తో పూడిక తీయించారు. అలాగే గ్రామంలోని ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన మురుగును కూలీలతో తొలగించి, నీరు సాఫీగా సాగేలా చేస్తున్నారు. వర్షాకాలంలో ఎలాంటి మురుగు సమస్య లేకుండా ఉండాలనే ఆలోచనతో ముందుగానే డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. పనులను పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

కొనసాగుతున్న జగన్నాథుని ఉత్సవాలు

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన బుధవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన రాజేష్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప గానామృతం భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గుడివాడకు చెందిన కొడాలి రాజా, జన్ను నారాయణరావు, బాబురావు ఆధ్వర్యంలో సమర్పించిన పూలరంగడు సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉత్సవాల ముగింపు రోజైన గురువారం ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

పమిడిముక్కల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందని నవజీవన్ బాలభవన్ ప్రాజెక్టు మేనేజర్ ఎండీ వసంతకుమారి అన్నారు. పమిడిముక్కల గ్రామంలో బుధవారం నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలు చదువుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో టీచర్ కాగిత హామిక పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

పమిడిముక్కల: మండలంలోని రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ నగదు పొందుటకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఈ నెల 20వ తేదీలోపు వివరాలు నమోదు చేసుకోవాలని గన్నవరం వ్యవసాయ సహాయకులు ఎం.సునీల్ కోరారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో పీఏసీఎస్ డీలర్స్, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే జూన్‌లో అందించే అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని తెలిపారు. ఫెర్టిలైజర్స్ డీలర్స్ అందరూ లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలని, రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉండాలని, ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగా ఎరువులు ఇండెంట్ పెట్టుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

గుడివాడ టౌన్: సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ డి. రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఈ బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు చార్జీ రూ. 2 వేలుగా నిర్ణయించామని తెలిపారు. బృందాలుగా ఏర్పడితే భక్తుల సౌకర్యార్థం బస్సును వారు బయలుదేరు స్థలానికి పంపిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 73829 03299లో సంప్రదించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు



గుడివాడ టౌన్: ఈనెల 20వ తేదీ జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు తాము సైతం మద్దతు ఇస్తున్నామని శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఆటోనగర్‌లో ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెకు కార్మిక ఉద్యోగులతో పాటు తాము పాల్గొంటామన్నారు. దేశ వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగల సంఖ్య పెరుగుతున్నప్పటికి కేంద్ర ప్రభుత్వ విధానాలు మారడంలేదని దానిని ఖండించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రామిక హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు ఆర్.రఘు, టి. లక్ష్మణరావు, అబ్దుల్ హమీద్, కుద్దూస్, బి. ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు మలుపులు



ప్రమాదభరింతగా కొర్లపాడు వద్ద రోడ్డు మలుపు



ప్రమాదభరితంగా ఉన్న తరుగుమూల టర్నింగ్

తరచూ ప్రమాదాలు

మండవల్లి: మండవల్లిలోని విజయవాడ-భీమవరం (నేషనల్ హైవే)రోడ్డులో మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. మండవల్లి సమీపంలోని గన్నవరం వెళ్లే టర్నింగ్ వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు ఎల్ షేప్‌లో ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడే అవకాశం లేదు. ఈ కారణంగా ఇక్కడ గతంలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది గాయాలుపాలవడంతోపాటు పలువురు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాదాలు అధికంగా తెల్లవారుజామున మూడు నుంచి ఐదు గంటల సమయంలో జరిగినవే.

కొర్లపాడు టర్నింగ్ వద్ద కూడా..

కొర్లపాడు వద్ద రోడ్డు టర్నింగ్ కూడా ఇదే విధంగా ఉంటంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. గతంలో ఒక వాహనం గుడివాడ వైపు వెళుతూ రోడ్డు పక్కన ఉన్న ఒక ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదభరితంగా ఉన్న వీటి స్థానంలో ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎదురుగా వస్తున్న వాహనం కనపడదు

విజయవాడ-భీమవరం జాతీయ రహదారిపై ఉన్న మలుపులు తరుగుమూల, కొర్లపాడు వద్ద ఉన్న మలుపు ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఎదురుగా వస్తున్న వాహనం కనిపించే అవకాశం లేదు. ఆ సమయంలోనే రోడ్డు ప్రమాదాలు జరిగే పరిస్థితులు అధికంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

–మన్నేపల్లి ఆదాం, మండవల్లి

ప్రమాదాలకు చిహ్నాలుగా మలుపులు

తరుగుమూల, కొర్లపాడు టర్నింగ్ రెండు మలుపుల వద్ద పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనదారుడు ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎదురుగా వస్తున్న వాహనాలు ఈ మలుపుల వద్ద కన్పించే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

–అర్జా రవికుమార్, మండవల్లి

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు



తోట్లవల్లూరులో వేణుగోపాలస్వామికి లక్ష మల్లెల పూజ



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

తోట్లవల్లూరు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ఎనిమిదో రోజైన మంగళవారం రాత్రి ఆలయ అర్చకుడు పీతాంబరం విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఆలయ కల్యాణ వేదికపై స్వామి వారికి లక్ష మల్లెల పూజ ఘనంగా జరిగింది. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. ఉత్సవాల ముగింపు రోజైన బుధవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు, గుమస్తా శ్రీనివాసరెడ్డి ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం



గుడ్లవల్లేరులో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో వార్తా పత్రికల ప్రాధాన్యంపై వివరిస్తున్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే క్రీడలతో మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం ఏర్పడుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడలతో పాటు బుధవారం వివిధ పోటీలను నిర్వహించారు.

నచ్చిన పుస్తకంతో విజ్ఞానం

మండవల్లి: నచ్చిన పుస్తకాన్ని తీసుకుని చదువుతూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు బుక్ సెలక్షన్‌పై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు నచ్చిన పుస్తకం సెలెక్ట్ చేసుకుని చదివారు.

విజ్ఞానానికి వార్తా పత్రికలు దోహదం

ముదినేపల్లి రూరల్: విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వార్తా పత్రికలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు వార్తా పత్రికల ప్రాధాన్యం, పఠనం గురించి వివరించారు. ప్రపంచంలో జరిగే అన్ని రకాల విశేషాలను పత్రికలు అందిస్తాయని వీటి పఠనం వలన సామాజిక చైతన్యం పెరగడంతో పాటు విజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి వార్తా పత్రికల పఠనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని అప్పుడే సమాజం సస్యశ్యామలంగా మారుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని శ్రీకోదండ రామాలయం మూడో వార్షికోత్సవ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని కాపాడుకోవడానికి ఆలయాలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయంలో పూజలను అర్చకులు ఆర్. సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ నిర్వాహకులు బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

గుడివాడ టౌన్: అంకిత మహిళాభివృద్ధి సంస్థ గుడివాడ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కళాజాత నిర్వహించారు. స్థానిక జగనన్న కాలనీ, నాగవరప్పాడు వైఎస్సార్ కాలనీ, తదితర ప్రాంతాల్లో హెచ్ఐవీ సోకడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఈ కళాజాత కొనసాగించారు. అంకిత సంస్థ మేనేజర్ టి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

దేశ క్షేమానికి శాంతి ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు

గుడివాడ టౌన్: భారతదేశ సంక్షేమాన్ని కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ నేలపాటి శామ్యూల్ ఆధ్వర్యంలో కారుణ్య మినిస్ట్రీస్ చర్చిలో ఈ ప్రార్థనలు జరిగాయి. భారతదేశంలో శాంతి, సమాధానం, సంక్షేమం దేశ నాయకుల సంక్షేమం, సైనికులకు రక్షణగా ఉండాలని, అమరులైన సైనిక కుటుంబాలకు ఓదార్పు, ఆదరణ కలగాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ వ్యవస్థాపకుడు పాస్టర్ జి. శ్యాంబాబు, పాస్టర్లు బి.సునీల్‌కుమార్, జి. యెహెజ్కేల్, సత్యం, ఎలీషా, నోవాహు, వరప్రసాద్, ప్రసన్నకుమార్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులకు చరిత్ర, సంస్కృతి, సమకాలీన సామాజిక విషయాలపై క్విజ్ పోటీలను నిర్వహించినట్లు ఉపాధ్యాయిని ఎస్. మాధవి తెలిపారు. మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో బుధవారం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దినపత్రికలు చదవడం ద్వారా సామాజికంగా ఎప్పటికప్పుడు జరిగే విషయాలు తెలుసుకోవచ్చున్నారు. అదేవిధంగా జనరల్ నాలెడ్జిని పెంపొందించుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

నేటి సమాజంలో ప్రతిఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికార ఎం.ఝాన్సీ రాణి అన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా బుధవారం కంప్యూటర్ వలన కలిగే ఉపయోగాలు వివరించారు. అనంతరం విద్యార్థులతో క్యారమ్స్ ఆడించినట్లు తెలిపారు.

19న నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పెదపూడి(మొవ్వ): పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రాల్లో ఈ నెల 19న నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కూచిపూడి-పెదపూడి సెంటర్లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఆయన ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో ఏదీ అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పామర్రు నియోజకవర్గ సమితి సభ్యుడు లింగమనేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కృష్ణా జిల్లా సమితి సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్, పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు కోసూరు వెంకట అప్పారావు, చందోలు నాగేశ్వరరావు, సమితి సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా తూనికలు, కొలతల దినోత్సవం



లీగల్ మెట్రాలజీ నిబంధనలను విడుదల చేస్తున్న అధికారులు, అసోసియేషన్ సభ్యులు

గుడివాడ టౌన్: ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం బులియనరి అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జైన్ మందిరంలో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ టి. రాజేంద్రప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు ప్రతి సంవత్సరం సిఖా వేయించుకోవాలన్నారు. బంగారానికి ఒక మిల్లీగ్రాము, వెండికి 10 మిల్లీగ్రాములు వేరియేషన్ మించకుండా కాటాలు సరిచేసుకోవాలన్నారు. వీటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సభ్యులందరూ ఎలక్ట్రానిక్ మిషన్ వాడుతున్నారో లేదో గమనించాల్సిన అవసరం స్థానిక అధికారులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ మచిలీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎస్. ఈశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు షా కీర్తికుమార్ జీవావత్, బోగాది మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోర్టబుల్ గ్యాస్ క్రెమేటర్ ప్రారంభం



క్రెమేటర్‌ను ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్, క్లబ్ సభ్యులు

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని వైకుంఠ ప్రస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోర్టబుల్ గ్యాస్ క్రెమేటర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ అనుబంధ సంస్థ రోటరీ కమ్యూనిటీ సర్వీసెస్ ట్రస్ట్ వైకుంఠ ప్రస్థానంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఆధునిక వసతులు ఇందుకు నిదర్శనమన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో ఈ విధమైన గ్యాస్ ఆధారిత పరికరాలు వినియోగించడం వలన వాతావరణంలో కాలుష్యం ఏర్పడదన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి. కిరణ్‌బాబు, కమ్యూనిటీ సర్వీసెస్ ట్రస్ట్ కార్యదర్శి వి. రామకృష్ణ, పూర్వ అధ్యక్షులు పి. చంద్రశేఖర్, వై. రెడ్డయ్య చౌదరి, రావి శ్రీహర్ష, పి. రామకృష్ణ, డాక్టర్ మలిరెడ్డి రవి పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ



పశుదాణాను అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పమిడిముక్కల: కపిలేశ్వరపురం పశువైద్యశాలలో పశుపోషకులకు 50 శాతం రాయితీపై పశుదాణాను బుధవారం పంపిణీ చేశారు. రూ.1,110 ఖరీదైన 50 కిలోల దాణాను రూ.555కే అందిస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకటేష్ పేర్కొన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు చిగురుపాటి జగదీష్, కొల్లిపర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

పామర్రు: రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పశువైద్యశాల ఆవరణలో రైతులకు సబ్సిడీపై పశుదాణా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీతో సమీకృత దాణాను రైతులకు అందిస్తున్నామన్నారు. తెల్లరేషన్ కార్డు కల్గి ఉన్న రైతులు అందరూ దీనికి అర్హులేనన్నారు. రైతులు భారత్ పశుధన్ యాప్‌లో తమ పేరును రిజిష్టర్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీసీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, నాయకులు పరస సుబ్రమణ్యం, పశువైద్యశాల ఏడీ సీహెచ్ శశికుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వాటర్ కూలర్ వితరణ



మొవ్వ: వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా మండవ కోటేశ్వర రావు (బుజ్జి) కుమార్తె లక్ష్మీ తులసి జ్ఞాపకార్థం వాటర్ కూలర్‌ను భర్త తుమ్మల గౌతం, కుమార్తె దేష్న మొవ్వ శాఖా గ్రంథాలయానికి వాటర్ కూలర్‌ను లైబ్రేరియన్ టి కృష్ణ కుమారికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తుమ్మల గౌతం, దేష్న, మండవ కోటేశ్వరరావు, మండవ రవి కిరణ్, మండవ వెంకటరావు, పిచ్చేశ్వరరావు, కృష్ణారావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, నాగభూషణం, నాగబాబు పాల్గొన్నారు.

'వైఎస్సార్ సీపీలో భయపడేవారు లేరు'

గుడివాడ టౌన్: పాత వీడియోలను మార్ఫింగ్ చేస్తూ వ్యక్తిగత హననం చేస్తే బెదిరిపోయేవారు వైఎస్సార్ సీపీలో ఎవరూ లేరని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం అన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేయడం ప్రారంభించిందన్నారు. తన పిల్లల చదువు నిమిత్తం విజయవాడలో ఉంటున్న తాను మూడు నెలల వరకు పట్టణానికి వచ్చే పరిస్థితి లేకుండా చేశారన్నారు. ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు వ్యక్తులు తన ఇంటి ముందు ప్రతిరోజూ తాగి అల్లరి చేయడం, ఇంటిపై రాళ్లు వేయడం, ఇంట్లోకి ప్రవేశించి తల్లిదండ్రులను బెదిరించడం చేసేవారన్నారు. ఈ నేపథ్యంలో తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నారని విజయవాడకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేయించాలంటే తాను గుడివాడ రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తాను గుడివాడ వస్తే దాడులు చేయడానికి టీడీపీ మూకలు చూస్తున్నాయని తెలిసి తనకు గతంలో పరిచయం ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులకు విషయాన్ని వివరించానన్నారు. ఈ నేపథ్యంలో తన తండ్రిని ఆస్పత్రికి తరలించాలంటే ఎమ్మెల్యే రాముకు పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారన్నారు. తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాను క్షమాపణ చెప్పేందుకు సిద్ధం కాగా కొడాలి నానిని విమర్శిస్తూ ఒక ప్రెస్ నోట్ తనకు పంపి ఉన్నది ఉన్నట్లుగా మీడియాకు చదివి వినిపించాలని సూచించారన్నారు. అందుకు ఒప్పుకున్న తాను గత ఏడాది సెప్టెంబర్ 12న మీడియా ముందు ఆ ప్రెస్ నోట్ చదివానన్నారు. అనంతరం కొన్ని గంటల్లోనే తన తండ్రి మృతి చెందడంతో ఆ వీడియోను మీడియాకు విడుదల చేయకుండా దాచిపెట్టారని, ఇప్పుడు తాను మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అయ్యాక ఆ పాత వీడియోను మార్ఫింగ్ చేసి మంగళవారం సోషల్ మీడియాకు వదిలారన్నారు.

21నుంచి అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయం పక్కనే తాడిశెట్టి పూర్ణయ్య, నాగేశ్వరరావు(పాము) వంశీయుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తాడిశెట్టి సాంబశివరావు బుధవారం తెలిపారు. 21న ఉదయం గోపూజ, పుణ్యాహ వచన, అఖండ దీపారాధన, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 22న నిత్య హోమం, అయ్యప్ప జప హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న మహా సుదర్శన హోమం, జలాధివాసం, ఆలయ శిఖర ప్రతిష్ఠ, అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం భారీ స్థాయిలో అన్న సమారాధన జరుగుతుందన్నారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తదితర నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో చంటి, సత్యనారాయణ, మధు శేఖర్, అన్నదాన కమిటీ చైర్మన్ వల్లూరిపల్లి చక్రవర్తి, బొగ్గరపు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 475 మంది హాజరు



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో బుధవారం జరిగిన మెగా జాబ్ మేళాలో భారీగా ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 475 మంది యువతీ యువకులు ఈ మేళాకు హాజరయ్యారు. 183 మంది ఉద్యోగాలకు ప్రత్యక్షంగా ఎంపికకాగా 74 మంది పై స్థాయి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీఎస్ అప్పారావు, జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి పి.సురేష్ కుమార్, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.